## కూటమి ప్రభుత్వంలో బీసీలకు సబ్సిడీ రుణాలు

వడ్డెర్ల సంఘం నాయకులు



విలేకరులతో కళ్యాణదుర్గం వడ్డెర సంఘం నాయకులు

**కళ్యాణదుర్గం, జనవరి 7 ప్రభాతవార్త**

మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలను అందుకున్న కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించి బీసీల జీవితాలలో వెలుగులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నదని వడ్డెర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు దేవుళ్ళ మురళి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు వెంకటేష్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని వడ్డెర్ల సామాజిక వర్గానికి చెందిన వారందరూ బీసీ కార్పొరేషన్ అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సబ్సిడీ రుణాల కోసం ఈనెల 8వ తేదీ నుండి 16వ తేదీలోగా అర్హులైన వారందరూ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జయరాములు, అజయ్ కుమార్, గోవిందప్ప పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

**భార్య జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన వస్తు సామాగ్రి వితరణ**

**కళ్యాణదుర్గం, జనవరి 7 ప్రభాతవార్త**



ఎర్రంపల్లి పాఠశాలలో విద్యార్థులకు వస్తు సామగ్రి అందజేత

మండల పరిధిలోని ఎర్రంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు పశు సంవర్ధక శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ కెవిఎస్ చౌదరి భార్య కొల్లి భాగ్యమ్మ జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన వస్తు సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కె వి ఎస్ చౌదరి మాట్లాడుతూ చిన్నతనము నుండి విద్య పట్ల ఆసక్తి పెంచుకొని ఉన్నతంగా రాణించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాలకు సౌండ్ సిస్టం, లైబ్రరీ పుస్తకాలు, ర్యాకులు, విద్యార్థులకు రాత పలకలు, రైటింగ్ ప్యాడ్స్, మరో 20 వేల రూపాయలను పాఠశాల అభివృద్ధికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చౌదరి దాతృత్వాన్ని పాఠశాల అధ్యాపకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, చౌదరి కుటుంబ సభ్యులు మధుకర్, రాధిక, నారాయణప్ప, గోపాలప్ప, పాఠశాల అధ్యాపకులు ఆదివారం తిప్పే స్వామి, పార్వతి, రమాదేవి పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ పెద్దమాంబ ఊరి దేవర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**బెలుగుప్ప, జనవరి 7 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల పరిధిలో జీడిపల్లి గ్రామంలో శ్రీ పెద్దమాంబ ఊరిదేవర మంగళవారం రోజు ముగిసిందని ఆలయ, గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారికి బలిదానాలు చేశారు. గ్రామంలో అధిక సంఖ్యలో ఆ ఊరిలో ఉండే బంధువులు అధిక సంఖ్యలో రావడం వల్ల పరిసరాలు కిటకిటలాడాయి. మేళ తాళాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సర్పంచు వెంకట నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు

**బెలుగుప్ప, జనవరి 7,ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల పరిధిలో అనిమిరెడ్డిపల్లి గ్రామంలో పశువైద్యాధికారి రమేష్, కళ్యాణదుర్గం పశువైద్యాధికారి మంజునాథ ఆధ్వర్యంలో అధ్యక్షులుగా తిప్పన్న, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, ఐదు మంది సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సహకార సంఘాలలో మీకు గొర్రెల, మేకలకు లోను కూడా ఇస్తామని వారికి తెలియజేశారు. మేకలకు, గొర్రెలకు, నట్టల నివారణ, నీలి నాలుక వ్యాధికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గుమ్మఘట్ట పశువైద్యాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.


## సహకార సంఘాల అభివృద్ధి అవగాహన కార్యక్రమం

**బెలుగుప్ప, జనవరి 7 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘాల సంఘం అభివృద్ధిపై హైదరాబాద్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ కార్పోరేట్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి మేనేజ్‌మెంట్ సంఘాల అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సహకార సంఘాల అభివృద్ధిపై సలహాలు సూచనలు అందజేశారు. సభ్యులు కూడా వారి సహకార సంఘాల సభ్యులు కూడా కొన్ని విషయాలను వారికి తెలియజేశారు. అందులో భాగంగా ఈ సహకార సంఘాల వల్ల అభివృద్ధి జరుగుతుందని, మరల మీకు లోన్లు సైతం ఇస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఆకస్మిక తనిఖీ

**బ్రహ్మసముద్రం, జనవరి 6, ప్రభాతవార్త**



రికార్డులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డి

బహ్మసముద్రము మండల పరిధిలోని తీట కల్లు సచివాలయంను ఈఓపీఆర్ డి రంగనాయకులు అకస్మిక తనిఖీ నిర్వహించారు. వివిధ రికార్డులను పరిశీలించి అనంతరం సర్వేలను త్వరిత గతిన పూర్తిచేయాలని సచివాలయం సిబ్బంది ని ఆదేశించారు.

## గుత్తిలో చోరీ

**గుత్తి, జనవరి 7 ప్రభాతవార్త**



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సిఐ

గుత్తి పట్టణంలోని బిసి కాలనీలో నివాసం వుంటున్న రాజేష్‌కుమార్ అనే ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. లక్ష రూపాయల నగదు, 15 తులాల బంగారు నగలు చోరీ అయినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

## మండల వ్యవసాయ శాఖ అధికారిని సస్పెంచ్ చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి ఎన్.లోకేష్ డిమాండ్

**డి.హిరేహాళ్, జనవరి 07 ప్రభాతవార్త:**



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.లోకేష్

డి.హిరేహాళ్ మండలంలో రైతు సమస్యలను పరిష్కరించాల్సిన వ్యవసాయ శాఖ అధికారి విధుల పట్ల అలసత్వం వహిస్తూ, రైతులకు అందుబాటులో లేకుండా రైతు సమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. మంలంలోని రైతులు ఏదైనా తమ సమస్యలను మండల వ్యవసాయ అధికారికి చేప్పుకోవడానికి కార్యలయానికి వస్తే, ఈ అధికారి ఒక్కరోజు కూడా రైతులకు అందుబాటులో లేకుండా రైత సమస్యల పట్ల ఈ అధికారి వ్యవహరిస్తున్న తీరును సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాకుండా, రైతు సమస్యల పట్ల పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్న ఈ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. లేని పక్షంలో మండల రైతాంగం మరియు రైతాంగం ఎదెర్కొంటున్న సమస్యల పట్ల ఈ అధికారి వ్యవహరిస్తున్న తీరు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు.

## జాతీయ రహదారి పనులు అడ్డగింత



రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

**డి.హిరేహాళ్, జనవరి 07 ప్రభాతవార్త**

జాతీయ రహదారి పనులకు పంబంధించి కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని కోర్టు ఏదో ఒక తీర్పు వెల్లడించేదాకా రహదారి పనులు చేపట్టరాదని తెదేపా నాయకుడు రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోషియేషన్ డైరెక్టర్ నాగలి రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. మంగళవారం డి.మిరేహాళ్ మండల కేంద్రంలో వాహనాల అండర్పాస్ పనులను జాతీయ రహదారి కాంట్రాక్టర్ రోడ్డు అభివృద్ధి పనులను హిట్టాచ్ ద్వారా చేస్తుండగా ప్రజలు అడ్డగించారు. ఎన్‌హెచ్ఏ కాంట్రాక్టర్ పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని పనులు అడ్డుకున్న వారికి నచ్చచెప్పినప్పటికి వారు ససేమీరా అంటూ మంగళవారం కోర్టులో వాయిదా ఉందని తీర్పు అనంతరం వారిని పనులు చేపట్టమని వారు ఎస్సైకు తెలిపారు. కోర్టు వాయిదాను తమను ధిక్కరించి పనులు చేపడితే ఆత్మహత్యలకు పాల్పడేందుకు వెనుకాడమని వారు ఈ సందర్భంగా జాతీయ రహదారి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

## డ్వాక్రా యానిమేటర్ చేతివాటం

**- మహిళా సంఘం సభ్యురాలి సంతకం ఫోర్జరీ చేసి నిధుల దోపిడీ**

**విడపనకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**



బాధితురాలు లత

పొదుపు సంఘాల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ స్థానిక డ్వాక్రా యానిమేటర్ మమత డ్వాక్రా మహిళ సంఘం సభ్యురాలి సంతకం ఫోర్జరీ చేసి లక్ష పది వేల రూపాయలను దోచుకున్న ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యానిమేటర్ మమత చేతివాటం ప్రదర్శించి మహిళా సంఘం సభ్యురాలిని మోసం చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. విడపనకల్లు గ్రామంలో ఇందిర గ్రామ సంఘం కింద వున్న చార్మినార్ మహిళా సంఘానికి బ్యాంకు లింకేజి ద్వారా 15 లక్షల రుణం మంజూరు అయింది. ఈ రుణాన్ని పది మంది సభ్యులు పంచుకోగా ఒక్కొక్కరికి 1.5 లక్షల చొప్పున కేటాయించారు. ఈ సంఘంలో సభ్యురాలిగా వున్న లత బెంగుళూరులో నివసిస్తోంది. లత ఖాతాలో 1.5 రుణం జమ అవ్వడంతో యానిమేటర్ మమత లతకు ఫోన్ చేసి ఆమె ఖాతాలో పొరపాటున వేరే వారి డబ్బులు జమ అయ్యాయని నమ్మించి ఆ డబ్బును తనకు ఫోన్ పే ద్వారా పంపాలని కోరింది. మమత మాటలకు నమ్మిన లత 1.1 లక్షలు ఫోన్‌పే ద్వారా మమతకు పంపింది. కొన్ని రోజుల తరువాత బెంగుళూరు నుండి ఊరికి వచ్చిన లత తన బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా రుణం తీసుకున్న వివరాలు కనిపించి ఆశ్చర్యానికి గురైంది. ఈ విషయంపై మమతను ప్రశ్నించగా మమత ఎలాంటి సంబంధంలేదని తప్పించుకునే ప్రయత్నం చేసింది. లత అనుమానంతో తన వివరాలను పరిశీలించగా తాను మహిళా సంఘంలో సభ్యురాలిగా వున్నట్లు తన పేరుతో మమత ఫోర్జరీ చేసినట్లు తెలుసుకుంది. లత చెప్పిన వివరాల ప్రకారం గత 8 ఏళ్లుగా తాను బెంగుళూరులో నివసిస్తున్నానని ఈ వ్యవహారంలో తానెప్పుడూ పాల్గొనలేదని మమత తన వివరాలు సేకరించి ఆమె అనుమతి లేకుండానే తన పేరును మహిళా సంఘంలో చేర్చిందని ఆరోపించింది. యానిమేటర్ మమత తన సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు నుండి రుణం పొందినట్లు లత తెలిపారు. ఈ విషయమై లత సోమవారం విడపనకల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మమత తన సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు అధికారులను మోసం చేసిందని ఆరోపించింది. మమతపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

**అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కాలానాయక్ వివరణ :**



బాధితురాలు నన్ను ఇంతవరకు సంప్రదించలేదు. అయితే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఇప్పటికే విచారణ చేపట్టాము. విచారణలో మమత సంతకాలు ఫోర్జరీ చేశారని తెలితే ఆమెను విధుల నుండి తొలగించడమే కాకుండా ఆమెపై క్రిమినల్ కేసులు కూడా నమోదుచేస్తాం పూర్తి స్థాయిలో విచారణ పూర్తయిన తరువాత మాత్రమే మరింత స్పష్టత ఇవ్వగలమని తెలిపారు.

## లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన సదస్సు

**విడపనకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న డాక్టర్

మండలంలోని పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో పిసి పిఎన్‌టిటి చట్టం (గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, మాత శిశు మరణాల నిర్మూలన)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల వివక్షత తగదని అంతేకాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా తెలియపరిచినా ప్రోత్సహించినా వారిపై గర్భస్త పిండ పరీక్షా ప్రక్రియ నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం-1994 చట్టం ప్రకారం 10 వేల నుండి లక్షరూపాయల వరకు జరిమానా మూడు నుండి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ స్త్రీ పురుషుల సమానత్వం గురించి ప్రస్తావిస్తూ ఆడ శిశువుల పట్ల కొందరు కలిగించే అనాదరణను తొలగించాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కల్ల కలిగిఏ గర్భస్రావాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చట్టం గురించి వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి త్యాగరాజు, సూపర్‌వైజర్లు సుధాకర్, యశోదమ్మ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ**



జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, జనవరి 7 ప్రభాతవార్త**

రెవెన్యూ సదస్సులో సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ పరస్పర సహకారంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని, తద్వారా సమస్యల పరిష్కారం త్వరగా లభిస్తుందని అలాగే ఆ గ్రామం ఆదర్శ గ్రామంగా మారేందుకు ఉపయోగపడాలని తెలియచేశారు. రీ సర్వే వల్ల ఏర్పడిన సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని రైతులకు తెలియచేశారు. ముఖ్యంగా జాయింట్ ఎల్‌పిఎంల సమస్యలకు, విస్తీర్ణంలో వచ్చిన తేడాలను సమగ్రంగా విచారణ జరిపి తగిన విధమైన పరిష్కారం చేస్తాయని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓబులేసు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**- టిడిపి కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్ డిమాండ్**

**గుంతకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌గౌడ్

మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అరోపణలపై ఏసిబి చేత విచారణ చేపట్టాలని టిడిపి కౌన్సిలర్ పవన్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ మీట్ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించి బడ్జెట్ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని అంశాలను చదవడం ప్రారంభం కాగానే మైకు అందుకున్న టిడిపి కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభానికి నోచుకోలేదని, కౌన్సిల్ ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం వుండగా కొత్త పనులు ఎప్పుడు చేపడతారన్నారు. ప్రభుత్వం మారినా పట్టణంలో అభివృద్ధి పనులు జరగకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసి ఆయన కౌన్సిల్‌మీట్‌ను బైకాట్ చేసి వెళ్లిపోయారు. కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ పారిశుధ్యం గురించి అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. స్పందించిన చైర్‌పర్సన్ పారిశుధ్యం లోపించిన మాట వాస్తవమేనని రాబోయే రోజుల్లో ఈ విషయంపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పారిశుధ్యం చక్కబెట్టే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమీషనర్ నయీమ్‌అహమ్మద్, ఎంఇ లీలాకృష్ణప్రసాద్, డిఇ సురేష్, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, రెవెన్యూ ఆఫీసర్ తారక్‌నాథ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులునాయక్, ఏఇ హరికృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

**గుంతకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**

భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి ఆంధ్రప్రదేశ్ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కడప ఉక్కు పరిశ్రమను 20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామి ఇచ్చి తుంగలో తొక్కిందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతిప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హజరత్ ఖాజా నవాజ్ ఉరుసు



మసీదులో గుమ్మనూరు ఈశ్వర్, నారాయణస్వామిలు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 7 ప్రభాతవార్త**

పట్టణంలోని జామియా మసీదులో మంగళవారం హజరత్ ఖాజా గరిబన్ నవాజ్ 813వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామిలు హాజరయ్యారు. అనంతరం వారు ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు హుస్సేన్‌పీరా, టిడిపి కన్వీనర్ ఎంకె చౌదరి, పట్టణ, మండల ముస్లిం మైనార్టీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కురుబ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**గుత్తి, జనవరి 7 ప్రభాతవార్త**

గుత్తి మండల కురుబ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. సంఘం అధ్యక్షునిగా పర్వతం భీమలింగయ్య, ఉపాధ్యక్షునిగా కుమార్‌లతో కూడిన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, పర్వతం శేఖర్, వెంకటేష్, శివరంగయ్య, సుబ్బరాయుడు, ఆంజనేయులు, గంపన్న, తదితరులు పాల్గొన్నారు.



కురుబ సంఘం అధ్యక్షున్ని సన్మానిస్తున్న దృశ్యం

## పదేళ్ళుగా సాగు చేసుకొంటున్న భూమిని ఇతరులకిచ్చి అన్యాయం చేశారు..!

**-కలెక్టర్ ముందు గోడు వెల్లబోసుకున్న రేణిమాకులపల్లికు చెందిన కౌలు రైతులు**



అర్జీ ఇచ్చి సమస్యను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు తెలియజేస్తున్న కౌలు రైతులు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

భూమిలేని నిరుపేదలమైన ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన తాము గుట్టలు, ముళ్ళపొదలతో నిండివున్న భూమిని తమ సొంత ఖర్చుతో చదును చేసుకొని అందులో గడిచిన పదేళ్ళుగా పంటలు పెట్టుకొంటూ కుటుంబాలను పోషించుకొంటూ ఉంటే దేవాదాయశాఖ అధికారులు ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇచ్చి అన్యాయం చేశారని తమకు న్యాయం చేయాలని మండల పరిధిలోని రేణిమాకులపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యస్వామి ఆలయ భూమిని సాగు చేసుకొంటున్న కౌలు రైతులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని రేణిమాకులపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరుకాగా ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందించారు. గ్రామంలోని సర్వే నంబర్ 103ఎలోని 9.67 ఎకరాల రేగడి భూమిని సాగు యోగ్యంగా చేసుకొంటూ క్రమం తప్పకుండా దేవాదాయశాఖ అధికారులకు గుత్తలు చెల్లిస్తూ వస్తున్నామని గత 5 నెలల క్రితం కూడా గుత్త కట్టడానికి వెళితే ఉరవకొండ గ్రూప్ టెంపుల్స్ అధికారులు మావద్ద గుత్తలు కట్టించుకోకుండా మాకు తెలియకుండా ఇతరులకు ఆ భూమిని సాగు చేసుకోవడానికి అనుమతులిచ్చి వారితో గుత్తలు కట్టించుకున్నారని వాపోయారు. ఇప్పటికీ ఆలయ భూముల్లో తామే కంది పంటను సాగు చేస్తున్నామని అలాంటి భూమిను ఇతరులకు సాగు చేసుకోవడానికి అనుమతులిచ్చి గుత్తలు కట్టించుకోవడం అన్యాయమన్నారు. తమకు ఎలాంటి ఆస్థిపాస్తులు లేవని పేదలమైన తమకే భూములను కేటాయించి గుత్తలు కట్టించుకోవాలని కోరారు. దీంతో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పందించి అక్కడే వున్న దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి బి.విజయ్‌కుమార్‌తో సమస్యపై ఆరాతీసి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు వన్నూరుస్వామి, నారాయణస్వామి, ఓబుళమ్మ, కంచన్న, పార్వతి, సుధమ్మ, లింగప్ప, ఈరయ్య, నాగేష్, లింగరాజు తదితరులు ఉన్నారు.

## జర్నలిజానికి వన్నె తెచ్చిన వ్యక్తి దేవప్రసాద్

**-భౌతికకాయంవద్ద నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి**



ప్రసాద్ భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

జర్నలిజానికి వన్నె తెచ్చిన ఆదర్శంతమైన వ్యక్తి దేవప్రసాద్ అని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు దేవప్రసాద్ భౌతిక కాయాన్ని మంగళవారం ఆయన అనంతపురం ప్రెస్ క్లబ్‌లో సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాటాడుతూ దేవప్రసాద్‌తో తనకు కళాశాలల్లో చదువుకునే రోజుల నుండి అనుబంధం ఉందని దివంగత సీనియర్ జర్నలిస్టు తిమ్మారెడ్డికు కూడా ఆయన మంచి మిత్రుడన్నారు. ప్రెస్‌క్లబ్ నిర్వహణలో, జర్నలిస్టు యూనియన్‌లో చురుకైన పాత్ర పోషించిన నిజాయితీపరుడైన జర్నలిస్టును కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్ఆర్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కె.వి.రమణ, సి.పి.వీరన్న, వేమయ్య యాదవ్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీజీహెచ్ఎస్ఎస్ నాయకులు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు దళిత గిరిజన హక్కుల సాధన సమితి (డీజీహెచ్ఎస్ఎస్) నాయకులు విన్నవించారు. మండల పరిధిలోని రేణిమాకుపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరుకాగా ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీజీహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలకు ఏబీసీడీలుగా జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసుకోవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థాన ం సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని అందుకు అనుగుణంగా సామాజిక న్యాయం జరుగాలంటే అట్టడుగు వర్గాల వారందరినీ కుల ప్రాతిపదికన ఏబీసీడీలుగా వర్గీకరణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే బి.రమేష్, జిల్లా అధికార ప్రతినిధి సోమశేఖర్, నాయకులు చాబాల నరేంద్ర, తట్రకల్లు కుళ్లాయప్ప పాల్గొన్నారు.

## హత్యా యత్నం కేసులో ఇద్దరు అరెస్టు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

మండల పరిధిలోని మోపిడి గ్రామంలో డిసెంబర్ 31న ఎగ్గిడి నారాయణస్వామి అనే వ్యక్తిపై జరిగిన హత్యా యత్నం కేసులో నిందితులుగా ఉన్న మీనుగ వంశీ, మీనుగ ఓబన్నలను అరెస్టు చేసినట్లు యుపీఎస్ సీఐ బి.మహానంది మంగళవారం తెలిపారు. పాత విషయాలను మనుసులో పెట్టుకొని చంపాలన్న ఉద్దేశంతో వారు గొడ్డలితో నరకగా ఎగ్గిడి నారాయణస్వామికు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఈ విషయమై జనవరి 1న బాధితుడి భార్య సుంకమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే నిందితులు ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని సీఐ బి.మహానంది వివరించారు.



అరెస్టు చేసిన నిందితులతో ఏఎస్ఐ స్టాన్లీ పాల్ సిబ్బంది

## పావగడలో విలేకరిపై దాడి

- యూనియన్ సంఘాల ర్యాలీ, ధర్నా



తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న విలేకరులు

**పావగడ, జనవరి 7 ప్రభాతవార్త**

పట్టణంలో సోమవారం సాయంత్రం గడినాడు మిత్ర (వార పత్రిక) ఎడిటర్ రామాంజినప్పపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం తాలూకాలోని విలేకరుల సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పిడబ్ల్యూడి గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శనిమహాత్మ సర్కిల్‌లో మానవహారాన్ని నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం చేరుకొని ధర్నా నిర్వహించారు. కెయూడబ్ల్యూజె సంఘం అధ్యక్షులు జివన్ హనుమంతరాయప్ప ప్రధాన కార్యదర్శి రెడ్డే శ్రీనివాసులు మాట్లాడుతూ.. నేడు సమాజంలో విలేకరులకు భద్రత కరువైందని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రామాంజినప్పపై దాడి చేసిన నారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. తదనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సిఐ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాలూకాలోని వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ధర్నాకు వివిధ సంఘాల నాయకులు మద్దతు పలికారు.

## హులికల్లు చెరువు ఆక్రమణ అడ్డుకోవాలి

**డి.హిరేహాళ్, జనవరి 07 ప్రభాతవార్త:**

హులికల్లు చెరువును కొందరు కబ్జాదారులు దురాక్రమణకు పాల్పడి కబ్జా చేశారని కబ్జాదారుల నుండి చెరువుకు రక్షణ కల్పించాలని కల్యం గ్రామ ప్రజలు తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం డి.హిరేహాళ్ మండలం కల్యం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులో ప్రజలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. చెరువుకు ఇరువైపుల ఉన్న కొండలో పర్యావరణ పరిరక్షణ కింద చెట్లు నడకుండా ఊట ఎన్నో సంవత్సరాలుగా కాపాడుకుంటు వస్తున్నామని వినతిపత్రంలో తెలిపారు. చెరువుకు ఇరువైపులా ఎద్దుల బండ్లు వెళ్ళేలా దారి చేయించాలని ఈ దారి ఏర్పాటు చేస్తే పశువులు, మేకలు, గొర్రెలు, మేతలకు కోసం కొండకు వెళ్ళి వచ్చేందుకు సులువుగా ఉంటుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ చెరువు 74సర్వే నెంబర్లో ఉందని చెరువును సర్వే చేసి చెరువుకు ఇరువైపులా దారి వెళ్ళేలా హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు వినతిపత్రం ద్వారా తహాపీసీల్దార్ ను కోరారు. గ్రామంలో స్మశాన వాటికకు స్థలం చేపి స్మశాన వాటిను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ ప్రజలకు అవకాశం కల్పించాలని వారు వినతిపత్రంలో తహసీల్దార్ కు విన్నవించారు.

## మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

**గుంతకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలతో పాటు 2024-25 ఏడాదికి సవరించిన అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంగళవారం చైర్‌పర్సర్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశంలో అకౌంట్స్ అధికారిణి సాయిలక్ష్మి బడ్జెట్ ప్రవేశపెట్టారు. గత ఏడాది మిగులు బడ్జెట్ కింద 48 కోట్ల 95 లక్షల 7 వేల 690 రూపాయలు చూపగా ఈ ఆర్థిక సంవత్సరంలో 47 కోట్ల 57 లక్షల 70 వేల రూపాయల సాధారణ మూలధనం జమ అంచనాలు కలుపుకుని 96 కోట్ల 52 లక్షల 77 వేల 690 రూపాయల ప్రారంభ నిల్వగా చూపారు. 2025-26 ఆర్థిక ఏడాదిలో సాధారణ మూలధనం ఖర్చులు 46 కోట్ల 48 లక్షల 40 వేల రూపాయల అంచనాలు రూపొందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నిల్వలో ఖర్చులు పోను 50 కోట్ల 4 లక్షల, 37 వేల 690 (50.05 కోట్లు) రూపాయలు మిగులు బడ్జెట్‌గా అధికారులు చూపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిజంపై దాడులను అరికట్టాలి

**పుట్టపర్తి (కల్చరల్), జనవరి 07, ప్రభాతవార్త**

రోజురోజుకు జర్నలిజంపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడపాల వేమనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ చత్తీస్ గడ్ లో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంలో 100 కోట్లకు పైగా అవినీతి జరిగిందని జాతీయ మీడియా ద్వారా ప్రసారం చేశారనే అక్కసుతో జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ ను అతి కిరాతకంగా హత్య చేసి మానవ సమాజం సిగ్గుపడేలా అవయవాలను బయటకు తీసి ముక్కలు చేయడం చూస్తే కార్పొరేట్ కాంట్రాక్టర్లకు పాలకవర్గాల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాల ముందు అమెరికన్ వాల్ స్ట్రీట్ జనరల్ రిపోర్టర్‌ను తల తీసేసిన పాకిస్తాన్ తీవ్రవాదులను మించిపోయేలా భారతదేశంలో జర్నలిజం పై దాడులు జరుగుతున్నాయని వీటిని అరికట్టడానికి భారత ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జర్నలిజం పై జరుగుతున్న దాడులను శాంతి కాముకులందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

## జాతీయస్థాయి పోటీల్లో ఉరవకొండ విద్యార్థినులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

కలరింగ్, హ్యాండ్ రైటింగ్-2024 పోటీల్లో ఉరవకొండ పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.అనిత కుమారి మంగళవారం తెలిపారు. గుజరాత్‌కు చెందిన రెయిన్‌బో ఆర్ట్ సెంటర్ జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించగా స్థానిక పాఠశాలలో గత ఏడాది డిసెంబర్ 16న పోటీలు జరిపి వాటిని సదరు సంస్థకు పంపడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే సదరు సంస్థ కలరింగ్ పోటీల్లో యుకేజీ విద్యార్థి ఎ.ఎస్.సమీల్‌తోపాటు హ్యాండ్ రైటింగ్‌లో 4వ తరగతి విద్యార్థిని కె.జెస్సీ, 7వ తగరతి విద్యార్థినులు పి.గౌసియా, ఎం.హిమజ, జి.సంకీర్తన, బి.హర్షియా తాజ్, కలరింగ్‌లో 8వ తరగతి విద్యార్థిని ఎ.హనీఫా, 9వ తరగతి విద్యార్థినులు నజీన్ కౌసర్, ఎస్.మైమూన్ బంగారు పతకాలు సాధించారన్నారు. వీరితోపాటు కలరింగ్‌లో 6వ తరగతి విద్యార్థిని టి.మహీర అంజుమ్, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని టి.నఫీసా, 10వ తరగతి విద్యార్థిని ఎ.అఫ్సానా వెండి పతకాలు సాధించారన్నారు. హ్యాండ్ రైటింగ్‌లో 5వ తరగతి విద్యార్థిని నందిని, కలరింగ్‌లో 7వ తరగతి విద్యార్థిని ఎస్.రక్షిత రజత పతకాలు సాధించారని వివరించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు పతకాలు, సర్టిఫికేట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్, ఆర్ట్ టీచర్ ఎస్.కల్పన పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

గుంతకల్లు రోడ్డులోని ప్యాపిలి మైక్రోవేవ్ టవర్ సమీపంలో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపుతప్పి జరిగిన ప్రమాదంలో పట్టణంలోని 7వ వార్డుకు చెందిన శివ, సతీష్, అనీల్ గాయాపడ్డారు. వారు కడమలకుంటకు వెళ్లి తిరిగి ఉరవకొండకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో స్థానికులు గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశాలు లేక కుంటుపడిన అభివృద్ధి

టిడిపి కౌన్సిలర్లు కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి కౌన్సిలర్లు

**కళ్యాణదుర్గం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:**

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో రాజకీయాల నడుమ మూడు మాసాలుగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. మున్సిపాలిటీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పాలకవర్గం అధికారంలో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ పరిస్థితులు చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. అక్టోబర్లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగినట్లు సంతకాలతో మమ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాజ్ కుమార్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా కమిషనర్ అందుబాటులో లేరని, కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేయడానికి సహకరించడం లేదని ఆరోపిస్తున్నారు. అయితే మున్సిపల్ కమిషనర్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిసెంబర్లోనే బడ్జెట్ సమావేశాలు చేయాల్సి ఉందని, బడ్జెట్ సమావేశం నిర్వహించకపోతే మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు సాగించే వీలు లేదని, సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా చైర్మన్ రాజ్ కుమార్ కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసిన స్పందించలేదని మున్సిపల్ కమిషనర్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ కు, కమిషనర్ కు మధ్య పాలన విభేదాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఆరు మంది కౌన్సిలర్లు కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ను కలుపుకొని, మునిసిపల్ సమావేశాలు మూడు మాసాలుగా నిర్వహించడం లేదని, తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించు కునేందుకు వీలు కావడం లేదని విన్నవించారు. అంతేకాకుండా వెంటనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజకుమార్ తో మహిళా చైర్మన్లు సెల్ ఫోన్ లో చర్చలు జరిపారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు సాగాలంటే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు ఎంతో అవసరమని, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు పట్టణాన్ని సుందరంగా, సౌకర్యంగా, ఆదర్శంగా తీర్చిదిద్దాలని సంకల్పించారని, వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసేందుకు చైర్మన్ రాజ్ కుమార్ తో పాటు పాలకవర్గం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోవున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అకాడమీ ఫర్ టెక్నికల్ స్కిల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ అధ్యక్షతన జరిగిన ప్రాంగణ నియామకాల్లో డిప్లొమో ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌కు చెందిన 15 మంది విద్యార్థులు హాజరుకాగా వారికి సదరు కంపెనీ మోబిలైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు 24 రోజులు శిక్షణ అనంతరం చెన్నైలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ అసెంబ్లింగ్ యూనిట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారికి నెలకు 18,500 రూపాయలు జీతం ఇవ్వడంతోపాటు సంవత్సరానికి అదనంగా 12,000 రూపాయలు పారితోషికం, ఇతర వసతులు కల్పించబడుతాయని వివరించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్, ట్రిపుల్ యియియి శిభాగాధిపతి వై.సురేష్‌బాబు, సాధారణశాఖ విభాగాధిపతి డాక్టర్ వి.నరసింహారెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.సులోచన, కళాశాల ప్రాంగణ నియామాధికారి ఎస్.అలిహాఫ్ హుసేన్, ఇతర అధ్యాపకులు అభినందించారు. అనంతరం కంపెనీ ప్రతినిధి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ (హెచ్‌ఆర్) ఆర్.ప్రవీణ్‌కుమార్‌ను వారు శాలువాకప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## వంకను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయండి

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

పట్టణ శివారు హమాలీ కాలనీవద్ద పెద్ద వంకను ఆక్రమించి కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని వాటిని నిలుపుదల చేయాలని ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌కు పంచాయతీ 9వ వార్డు సభ్యుడు చేజాల ప్రభాకర్ మంగళవారం వినతిపత్రం అందించారు. వంక భూమిని పరిశీలించి భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసిన సమయంలో సదరు ప్రాంతం ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## అనారోగ్యంతో మీనుగ చెన్నకేశవులు మృతి

**ఉరవకొండ, జనవరి 7 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎంఆర్‌పీఎస్ (దండోరా) సీనియర్ నాయకుడు మీనుగ చెన్నకేశవులు అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన దండోరా ఉద్యమం మొదలైన నాటి నుండి మొన్నటివరకు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి దళితుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. చెన్నకేశవులు మృతి ఎంఆర్‌పీఎస్‌కు తీరని లోటని ఆయన కుటుంబానికి భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ప్రసాధించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు.

## బీసీ, ఈ బీసీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

**తాడిమర్రి జనవరి 7 (ప్రభాతవార్త)**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీసీ, మరియు ఈ బీసీ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకట రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ రుణాల మంజూరు కోసం ఓబిఎంఎంఎస్ వెబ్సైట్ ద్వారా ఈనెల 8 నుండి 16 తేదీలోగా గ్రామపంచాయతీ పరిధిలో గాని మరియు సచివాలయ పరిధిలో గాని దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. ఈ అవకాశాన్ని బీసీ, ఓబిసి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు...!

**ధర్మవరం,జనవరి7, ప్రభాతవార్త**

ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ చొరవతో ఈ సంవత్సరం సంక్రాంతి పండగ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో ఆటల పోటీలు నిర్వహించబబోతున్నట్లు మంత్రి కార్యాలయం ఓ పత్రిక ప్రకటన విడుదల చేసింది . ఈ పోటీలు జనవరి 13 మరియు 14 తేదీలలో ధర్మవరం కాలేజీ గ్రౌండ్ లో జరగనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువతీ, యువకులు, మహిళలు, పెద్దలు అందరూ పాల్గొనాలని మంత్రి కార్యాలయ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. పోటీలు నిర్వహించడం ద్వారా సంప్రదాయాలను పటిష్టం చేయడమే కాకుండా, ఆరోగ్య క్రీడా విభాగంలో ప్రజల్లో చైతన్యం పెంచే అవకాశాలు ఉంటాయని తెలిపారు.క్రీడలు మరియు పోటీలు ప్రజల మధ్య స్నేహభావం, సహకారం మరియు ఆరోగ్యం పెంపొందించడంలో గొప్ప పాత్ర పోషిస్తాయని మంత్రి కార్యాలయ సిబ్బంది గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ప్రజలందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడాలని ఆశించారు. మీ అభిప్రాయం, సహకారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మీరు అందరూ ముందుకు రావాలని మనవి చేశారు.

## నూతన నాయి బ్రాహ్మణ సంఘం ఏర్పాటు



నాయి బ్రాహ్మణ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్న దృశ్యం

**సోమందేపల్లి జనవరి 7 ప్రభాతవార్త**

సోమందేపల్లి మండల కేంద్రంలో మంగళవారం నూతన నాయి బ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. నాయి బ్రాహ్మణలు సోమందేపల్లి లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో నూతన నాయి బ్రాహ్మణ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మనోహర్,ఉపాధ్యక్షులు గా ఆర్. నరసింహమూర్తి, కోశాధికారిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా అరవింద్,ఉప కార్యదర్శిగా మనోజ్ కుమార్ ను ఎన్నుకోవడం జరిగినది. నూతన కమిటీ సభ్యులు నాయి బ్రాహ్మణుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి, భవిష్యత్తులో నాయి బ్రాహ్మణుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బావయ్య, సంజీవ రాయుడు, పాపన్న, కుళ్లాయప్ప, నారాయణస్వామి, శ్రీనివాసులు , అశ్వత్తప్ప, మూర్తి మరియు సంఘం సభ్యులందరూ పాల్గొనడం జరిగినది.

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



**అగళి, జనవరి 7 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అగళి ఎస్సీ కాలనీలో 40 మంది అయ్యప్ప భక్తులు అయ్యప్ప మాలలను ధరించారు. 41 రోజులపాటు నిష్టగా అయ్యప్ప స్వామి భజనలను కీర్తలను చేశారు. ప్రతిరోజు సాయంత్రం అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్ణేశ్వరస్వామిలకు పూజలు నిర్వహించడంతో పాటు కర్పూర హారతిని అందించారు. మంగళవారం పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణపతి స్వామి, అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామిలను వివిధ రకాల పూలతో అలంకరించడంతోపాటు అయ్యప్ప స్వామి పడిపూజ ప్రాంతాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. 18 మెట్లను అరటి గెలతో తయారు చేసి భక్తితో రాత్రి అయ్యప్పస్వామి భజనలను, కీర్తలను చేశారు. అనంతరం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి, 18 మెట్లకు కర్పూరాలను వెలిగించి హారతిని పూర్తి చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

## కౌలు రైతు పాము కాటుతో మృతి

**కొత్తచెరువు జనవరి 7 ప్రభాతవార్త**



అప్పన్న గారి శ్రీనివాసులు (ఫైల్ ఫోటో)

కొత్తచెరువు మండల కేంద్రము కమ్మ పాలెం లో నివసిస్తున్న కౌలు రైతు అప్పన్న గారి శ్రీనివాసులు సోమవారం రాత్రి పాము కాటు గురైన మృతి చెందారు. బంధువులు అందించిన వివరాల మేరకు కొత్తచెరువు కు చెందిన అప్పన్న గారి శ్రీరాములు కుమారుడు అప్పన్న గారి శ్రీనివాసులు (45) కొంతమంది రైతులతో భూమిని కౌలుకు తీసుకొని టమోటా వరి తదితర పంటల సాగుకు చేసుకునేవారు ఈ క్రమంలోనే సోమవారం రాత్రి వరి పంట వేయడానికి సిద్ధం చేస్తున్న క్రమంలో నీళ్లు పెట్టడానికి వెళ్లిన క్రమంలో పొలంలో రక్తపింజరి పాము కాటు గురి కావడంతో వెంటనే సమీప బంధువులు సహాయంతో హుటాహుటిన శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ కి 108 లో తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు.

## నేటి నుంచి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు

- 10న ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వారా ప్రవేశం




**కొత్తచెరువు జనవరి 7 ప్రభాతవార్త**

కొత్తచెరువు మండల పరిధిలోని చెన్నకేశవపురం (ఇండ్ల వెంకటం పల్లి) గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవములు (పుష్కర బ్రహ్మోత్సవం) మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించబడతాయని ఆలయ ధర్మకర్త శ్రీమతి ఉషారాణి చెన్నారెడ్డి దంపతులు తెలిపారు 8 వ తేదీ బుధవారం ఉదయం పురోహితులు అర్చకులు వేదపండితులు తో సుప్రభాత సేవ,ను ప్రారంభిస్తారు అనంతరం ద్వజారోహణ అంకురార్పణ పూజా కార్యక్రమం నిర్వహించబడును అలాగే సాయంత్రం డోలోత్సవం ఉయ్యాల సేవ, పుష్పోత్సవం. 9 వ తేదీ ఉదయం పూజా కార్యక్రమాలు, హోమం. సాయంత్రం సుదర్శన హోమము, గరుడ వాహన సేవ నిర్వహించబడును 10 వ తేదీ ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని తెల్లవారుజామున ఐదు గంటలు నుంచి ఉత్తర ద్వారా ప్రవేశం. ఉదయం ఏడు గంటల నుంచి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి శతనామ హోమము, పూర్ణాహుతి, కుంభాభిషేకము, కల్యాణోత్సవం, మహా మంగళహారతి, సర్వదర్శనం సాయంత్రం చక్రస్నానం ధ్వజారోహణ, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొని. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసన




కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న దృశ్యం

**గుత్తి, జనవరి 7 ప్రభాతవార్త**

ప్రధానమంత్రి మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ మంగళవారం స్థానిక గాంధీచౌక్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కళ్లకు గంతలు కట్టుకుని నినాదాలు చేశారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయింపు ప్రత్యేక హోదా తదితర హామీలను విస్మరించిన ప్రధానికి రాష్ట్రానికి వచ్చే హక్కు లేదన్నారు. పరిశ్రమల ఊసే లేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నిర్మల, రామకృష్ణ, మల్లికార్జున, మల్లేష్, కవిత, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలుకు వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ




మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గుజ్జల ఈశ్వరయ్య.




భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**రాయదుర్గం రూరల్, జనవరి 07 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం 11సంవత్సరాలుగా దేశంలోని సంపదనంతా ఆదాని, అంబానీలకు కట్టబెట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, కడప జిల్లా సిపిఐ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభల్లో ఆయనతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శి నారాణస్వామి, మల్లికార్జున, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, రాజేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు సంజీవప్ప, ఎం.నాగార్జున, ఏఐవైఎఫ్ కర్ణాటక బళ్లారి జిల్లా అధ్యక్షుడు బసప్ప, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. ముందుగా పట్టణంలో ఆర్అండ్‌బి అతిథి గృహం నుండి అనంతపురం ప్రధాన రహదారి మీదుగా కణేకల్లు రోడ్డులోని జూనియర్ కళాశాల మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేసిన సభా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కడప జిల్లా సిపిఐ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ భారత దేశంలో సందపను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి 11ఏళ్ల ఎన్డీఏ ప్రభుత్వం అహోరాత్రులు కష్టపడుతుందని ఆయన విమర్శించారు. ఎన్డీఏ ప్రధాన మంత్రులు దేశంలో ఐఐటిలు, ట్రిబుల్ ఐటిలు, విమానాశ్రయాలు, రైల్వేలు, బ్యాంకులు, జాతీయకరణ, బిఎస్ఎన్ఎల్, రహదారుల నిర్మాణం చేపడితే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తార్వాత వాటన్నింటిని ప్రైవేట్ రంగానికి తరలించాలరని పేర్కొన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబునాయుడులు బిజెపికి తొత్తులుగా ఉండి ప్రజల్లో మత విద్వేషాలను సృష్టిస్తూ హిందూ, ముస్లిం అంటూ మతాల మధ్య చిచ్చు రేపుతూ సమానత్వం, హిందూయిజం అని చెప్పుకుంటూ దేశ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, నాయకులు కొట్రేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆంజినేయులు, సిపిఐ నాయకులు తిప్పేస్వామి, గురుస్వామి, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలతో సత్వర పరిష్కారం



రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

**డి.హీరేహాళ్, జనవరి 07 ప్రభాతవార్త:**

రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు చేపట్టడం జరిగిందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునివేలు తెలిపారు. మంగళవారం డి.హీరేహాళ్ మండల పరిధిలోని కల్యం గ్రామంలో తహసీల్దార్, తెదేపా నాయకుడు తిప్పేస్వామి ఆధ్వర్యంలో డిప్యూటి తహసీల్దార్ బసవకుమార్, సర్వేయర్ రవితేజ రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వినతుల రూపంలో వ్రాతపూర్వకంగా అధికారులకు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని సమస్యకు పరిష్కారం పొందాలని తహసీల్దార్ సూచించారు.

### చిన్నసన్న కారు రైతులకు న్యాయం చేయండి

కల్యం గ్రామంలో పెద్ద పెద్ద భూస్వాములు ఎవరూ లేరని అందరూ చిన్న సన్న కారు రైతులేనని సమస్యలపై వచ్చిన వారిని రెవెన్యూ కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేయించకుండా వారి సమస్యకు తక్షణం పరిష్కారం చూపి వారి మనన్నలు పొందాలని ఆ గ్రామ తెదేపా నాయకుడు తిప్పేస్వామి తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మా గ్రామంలో అధికశాతం మంది తల్లి, తండ్రి, భర్త మరణానతరం సంక్రమించాల్సిన వారసత్వపు భూమి వారి పేర్లపై మార్పు చేయించుకునేందుకు రెవెన్యూ కార్యాలయంకు వచ్చే బాధితులకు సత్వర పరిష్కారం చూపి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సదస్సులో దేవాదాయశాఖ అధికారి దిలీప్, విఆర్‌ఓ ఎద్దుల రఘునాథ్, సచివాలయ సిబ్బంది, విఆర్ఏలు చిదానంద, జటెంగి తదితరులు పాల్గొన్నారు.

## విడపనకల్లు గ్రామంలో రెవెన్యూ సదస్సు

**విడపనకల్లు, జనవరి 7 ప్రభాతవార్త**



తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు చెన్నరాముడు

గ్రామ ప్రజలు ఐదున్నర దశాబ్దాలుగా ఇంటి స్థలాల కోసం పోరాటాలు చేస్తూ ఇంకా తమ సమస్యకు పరిష్కారం దొరకక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరుపున తహశీల్దార్ సునీతబాయికి వినతిపత్రం అందచేశారు. సిపిఐ నాయకుడు ఎంబి చెన్నరాముడు మాట్లాడుతూ అనేక ప్రభుత్వాలు మారినప్పటికి ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. గతంలో తహశీల్దార్ సాగర్, ఎమ్మెల్యే గోపినాథ్ ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికి స్మశానం వున్న ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించడంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. దీంతో ఆది ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే భూమి పంపిణీకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

**లేపాక్షి, జనవరి 7 ప్రభాతవార్త**

మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందున్న జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, మండల కార్యదర్శి నందీష్‌లు మాట్లాడుతూ చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భాగంలో జాతీయ రహదారి వుండడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయన్నారు. సోమవారం పాఠశాల వదిలిన సమయంలో ద్విచక్రవాహనం ఢీ కొనడంతో లోకేష్ అనే విద్యార్థి తలకు బలమైన గాయాలయ్యాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే నిరవధిక నిరసన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.

